నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట: ఈ నెల 22న అయోధ్య ఆలయ ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత దంత చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగా రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట పీవీఆర్ ఆసుపత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యపురిలోని దత్తసాయి దంత వైద్య శాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని రకాల దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టూత్ పేస్ట్ కూడా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

22న ప్రత్యేకపూజలు

ముషీరాబాద్: వాసవీ సేవా సమితి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న రాంనగర్ చౌరస్తాలో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ప్రతినిధులు తెలిపారు. గోపూజ, గణపతి పూజ, తీర్థప్రసాదాలు, అన్నదానాలు చేపడతామని సేవా సమితి కన్వీనర్ ఆసరగోట్టు రాజశేఖర్‌గుప్తా, అధ్యక్షుడు వాడకట్టు రాజు, ప్రధాన కార్యదర్శి చెల్లా శివకుమార్, ప్రాజెక్టు చైర్మన్ బుక్కా రమేశ్‌గుప్తా, కోచైర్మన్ నేతి సత్యనారాయణ, కోశాధికారి గంజి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

అన్ని రంగాల అభివృద్ధికి కృషి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: డివిజన్‌లో అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ , కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌తో కలిసి గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ సెంటర్ నూతన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అయోధ్యలో రాముల ఆలయ ప్రారంభ సమయంలో ఈ కమ్యూనిటీహాల్ ప్రారంభం కావడం శుభసూచకమన్నారు. అశోక్‌నగర్‌లో మహిళలు చైతన్యవంతులన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నతాధికారుల్లో 60, 70 శాతం అధికారులు అశోక్‌నగర్‌లో కోచింగ్ తీసుకున్న వారే అన్నారు. తనకు ఈ ప్రాతంలో ఎంతో అనుబంధం ఉందని తాను గతంలోనూ ఇక్కడ నివసించానని ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అశోక్‌నగర్‌లో ఉన్నతాధికారులతో పాటు పలువురు మేధావులు ఉన్నారని, వారందరి సమష్టి కృషితో కమ్యూనిటీహాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డిజిటల్ లైబ్రరీని నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సూర్యప్రకాష్, డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, బీజేపీ నేతలు రమేష్ రామ్, వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, వీఎస్టీ రాజు తదితరులు పాల్గొన్నారు.



జి.కిషన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

కాచిగూడ: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు రెండో సారి ఎంపికైన సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కిషన్ రెడ్డిని కలిసి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీజేపీని బలోపేతం చేయడం కోసం గౌతమ్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా రెండవ సారి అవకాశం ఇచ్చినందుకు కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, చింతల రాంచంద్రారెడ్డి, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, కిలారి మనోహర్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

కవాడిగూడ: రజకుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభ్యున్నతికి విశ్వకర్మ యువజన పథకం ద్వారా రుణాలు అందజేస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బుద్ధపూర్ణిమ దోబీ ఘాట్‌వద్ద, మోతీలాల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నూతన పవర్‌బోర్ పనులను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిషలు కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక (దోభీ) అభివృద్ధి సంస్థ చైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహా రజక, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్, పి. కృష్ణ, నాయకులు రాజేశ్, ఎ.అశోక్, బుద్ధపూర్ణిమ దోభీఘాట్ అధ్యక్షుడు కె.రమేశ్, ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, బీజేపీ నేతలు జి. వెంకటేశ్, డివిజన్ అధ్యక్షుడు ఎం.సి మహేదర్‌బాబు, ఎ. ప్రభాకర్, కేశవరాజు, మోతీలాల్‌నగర్ ప్రజలు, రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు శ్రీరాముడు

చిక్కడపల్లి: సర్వమానవాళికి శ్రీరాముడు ఆదర్శనీయుడని ప్రముఖ సాహితీవేత్త జయరాములు అన్నారు. అయోధ్యలో జరిగే శ్రీరామ దివ్యవైభవం కవితా సంకలనాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మానవాళికి సర్వం రామమయమన్నారు. వెయ్యిమంది కవులు, కవయిత్రులతో రాములోరి జీవితంపై అయోధ్యలో కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలుగు భాషా చైతన్యసమితి అధ్యక్షుడు పి.బడేసాబ్ తెలిపారు. కార్యక్రమంలో జి.మనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, యోగేశ్, ప్రభు, బద్రినాథ్, సీపీ రెడ్డి, అంజనీకుమారి, జేపీ కుమార్, ప్రవీణ్, రాధాకుసుమ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కమిటీల పేరిట కాలయాపన తగదు'

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. శనివారం ఆయన విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కమీషన్లు, కమిటీల పేరుతో మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో కేసు ఉందని మందకృష్ణ మాదిగ బీజేపీ ప్రభుత్వానికి వంత పాడుతున్నందునే వర్గీకరణలో జాప్యం జరుగుతుందన్నారు. తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని లేని పక్షంలో బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు డాక్టర్ మల్లేశ్, గణేశ్, చాప కృష్ణ, పసులాది యాదగిరి, శ్యామ్‌రావు, రాజేశ్‌ఖన్నా, హన్మంతు, కొల్లూరు వెంకట్, ఎల్.నాగరాజ్, కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'నోటిఫికేషన్ ఆధారంగానే నియామకాలు చేపట్టాలి'

కాచిగూడ: గురుకుల నోటిఫికేషన్ ఆధారంగానే అభ్యర్థుల నియామకాలు చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావిద్ అన్నారు. శనివారం నారాయణగూడలోని డీవైఎఫ్ఐ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థులను నోటిఫికేషన్ ప్రకారమే రిక్రూట్మెంట్ నిర్వహించాలన్నారు. బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించినా ఫలితాలు వెల్లడించకుండా కాలయాపన చేసి పరోక్షంగా ఉన్నత న్యాయస్థానానికి తప్పుడు నివేదికలను సమర్పించి నియామకాలను ఆలస్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అభ్యర్థుల పక్షాన నిలబడి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

సున్నిత సునిశిత మనస్వి బాపు



తనికెళ్ల భరణికి బాపు పురస్కారాన్ని అందజేస్తున్న పి.విజయ్‌బాబు

చిక్కడపల్లి: సినీ దర్శకుడు, చిత్రకారుడు బాపు సున్నిత మనస్వి అని, ఆయన తీసిన ప్రతి చిత్రం కళాఖండమని ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శనివారం రాత్రి బాపు 90వ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ సినీ నటుడు, తనికెళ్ల భరణికి బాపు పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రచనలో నవరసాలను పలికించే శక్తి భరణికి ఉందని ఆయన అక్షరాల్లో ప్రతి పాత్ర ఆవిష్కృతమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన భరణికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిస్తామని ప్రకటించారు. సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భరణి కేవలం నటుడు మాత్రమే కాదని, అత్యున్నత వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కేంద్రసాంగీత నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యురాలు నాట్యగురువు డాక్టర్ ఎస్‌పి భారతి అధ్యక్షతన జరిగిన సభలో కళాపోషకులు కె.ఈ.రాజు , ఎం.వెంకటేశ్వరావు, స్వప్న, రాజు, స్వప్న శ్రీనివాస్, సుభాషిణి, పద్మావతి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో 'ఎలైట్ ఉమెన్' అనే అంశంపై శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విభిన్న రంగాల్లో మహిళలు, వారి పాత్రపై ఈనెల 28 న కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రితో జరగనున్న ఎలైట్ ఉమెన్ అంశానికి సంబంధించి పూర్తి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు మహిళలకు పలు సూచనలు చేశారు.

సర్వీసు రెగ్యులరైజ్ చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోస్టల్, ఆర్ఎంఎస్‌లో పనిచేస్తూ 1981–90 వరకు కోల్పోయిన సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై 1986లో క్యాట్‌లో కేసు గెలిచామని, హైకోర్టులోనూ తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయితే డిపార్ట్‌మెంట్‌లో ఉన్న కొందరు ఉన్నతాధికారులు మొండిగా వ్యవహరిస్తూ కేసు వేశారని, దీని వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగులు కోల్పోయిన సర్వీస్, ఇంక్రిమెంట్, ప్రమోషన్లను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.

27న ఫణి భార్గవ్ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ కళానిలయం, త్యాగరాయ గానసభ , సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి నాయకుడు ఫణి భార్గవ్ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 27న సాయంత్రం కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి సురేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు పగిడిపాల ఆంజనేయులు, ఎం.రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ కరస్పాండెంట్ కుమారి ఎస్.హేమలతకు నగదు బహుమతి, పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ఇంటర్ విద్యార్థి సాడియా బేగంకు ఆర్థిక సహకారం అందజేయనున్నట్లు తెలిపారు.

'ఇతర కులాలకు సభ్యత్వం ఇవ్వొద్దు'

కవాడిగూడ: మత్స్య సొసైటీల్లో ఇతర కులాలకు సభ్యత్వం ఇవ్వకూడదని, ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రిజల్యూషన్ ప్రవేశపెట్టిందని దానిని ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా గంగపుత్ర సొసైటీకి తెలియజేయాలని గంగపుత్ర మహాసభ తెలంగాణ గంగపుత్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె. ప్రసాద్ అన్నారు. తెలంగాణ గంగపుత్ర మహాసభ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద 'గంగపుత్రుల గోస' పేరుతో శనివారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేవలం సభ్యత్వాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వానికి అనుకూలమైన ఉత్తర్వులతో మత్స్యశాఖను భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ఉచిత చేపపిల్లల స్కీమ్‌లో లోపాలను సవరించి సహకార సంఘాలను చేప పిల్లల కొనుగోలులో ప్రత్యక్షంగా భాగస్వాములను చేయాలని, మత్స్యకార సహకార సంఘాల సభ్యులే చేప పిల్లలను ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాన్నారు.

సబ్ కోటాతోనే బీసీ మహిళలకు న్యాయం



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని అప్పుడే వారికి రాజ్యాధికారం దక్కుతుందని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం బీసీ భవన్‌లో బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదాగౌడ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహిళా సంఘాల ప్రతినిధుల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో పాసైన మహిళా బిల్లులో బీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికన సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే బిల్లుకు సార్థకత లేదన్నారు. రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లును లోక్‌సభలో కూడా ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కోరారు. మహిళా బిల్లుపై మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మహిళా బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా, ఉద్యోగాల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వరకట్నం నిషేధ చట్టం, అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర 19 చట్టాలు వచ్చినా మహిళలపై అత్యాచారాలు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుతోనే మహిళా ప్రగతి సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారన్నారు. లోటు బడ్జెట్‌లో ఉన్న ఏపీలో మద్యపాన నిషేధం అమలు జరుగుతుండగా మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోట్ల శ్రీనివాస్, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, అనంతయ్య, రాజేందర్, కరుణశ్రీ, వాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యేగా రెండోసారి ఘన విజయం సాధించిన ముఠా గోపాల్‌ను సీనియర్ వాలీబాల్ కోచ్ ఎం.బి.నర్సింహులు శనివారం ఆయన నివాసంలో కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉజ్వల్ చందర్‌కు సేవా పురస్కారం

కాచిగూడ: ప్రముఖ సంఘ సేవకులు, ఇంజినీర్ పడిగ ఉజ్వల్ చందర్ స్వామి వివేకానంద సేవ పురస్కారం –2024 అందుకున్నారు. శనివారం నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న పడిగ ఉజ్వల్ చందర్ సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు బత్తుల హేమంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, డాక్టర్ బాబు మోహన్, డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ శుద్ధి



నల్లపోచమ్మ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న పూస రాజు

ముషీరాబాద్: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు పూస రాజు భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో శనివారం శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రేగుల రవి, కృష్ణ, పులి ధర్మేందర్, సత్యనారాయణ, విజయ్, ముఖేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో ..

అంబర్‌పేట: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించుకోవాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. ప్రధాని పిలుపు మేరకు శనివారం గోల్నాక కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న హనుమాన్ ఆలయాన్ని శుద్ధి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మూల రవీందర్‌గౌడ్, కేసరి నర్సింగ్‌రావు యాదవ్, రవీందర్, ఆర్‌కె రాంచందర్, శ్రీధర్‌గౌడ్, రాజేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

త్రివిక్రమ్ క్షమాపణ చెప్పాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను వెంటనే తొలగించి దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్‌ల ఆధ్వర్యంలో త్రివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు టి.నాగరాజు, పుట్ట లక్ష్మణ్, ఎస్.నాగేశ్వర రావు, పి.రామకృష్ణ, పి.మహేశ్, ఆనగంటి వెంకటేశ్, కోట రమేశ్, ధర్మేంద్ర, కృష్ణ మాట్లాడుతూ సమాజం కోసం పని చేసిన వారిని అవమానించి రూ.కోట్లు దండుకునే ఆలోచన మానుకోవాలన్నారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో థియేటర్లు, త్రివిక్రమ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గీత కార్మికుల ప్రాణాలు కాపాడండి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లుగీత కార్మికులు బతుకుదెరువు కోసం ప్రమాదకరమైన గీత వృత్తిని చేస్తున్నారని ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ, కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గీత వృత్తిలో భాగంగా రెండు రోజులకు ఒకరు చనిపోతున్నారని వందలాది మంది కాళ్లు చేతులు విరిగి మంచాన పడుతున్నారని, గీత కార్మికులకు కావాల్సిన సేఫ్టీ మోకులను అందజేసి వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు వెంకట నర్సయ్య, ఎం.కృష్ణస్వామిగౌడ్, సుధాకర్‌గౌడ్, అంజనేయులు ఉన్నారు.

దేవాదాయ శాఖను రద్దు చేయాలి



కవాడిగూడ: దేశంలోని ఆలయాల ఆస్తులను దోపిడీ చేస్తున్న దేవాదాయ, ధర్మాదాయ శాఖను తక్షణమే రద్దు చేయాలని భారత్ నేషనలిస్ట్ ఫోరం వ్యవస్థాపకుడు రాజు కొత్తకోట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోరం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్థానంలో సనాతన ట్రస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆలయాలు, హిందూ సాంస్కృతిక కేంద్రాలను వ్యాపార కేంద్రాలుగా మార్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాల అభివృద్ధికి భక్తులు ఇచ్చిన విరాళాల నుంచి 34 శాతం పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయాలు, ఆస్తులను కాపాడుకోవడానికి హిందూ బంధువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు బి. రాంబాబు, కార్యదర్శి వంశీకృష్ణ, నాయకులు మల్లికార్జున్, మాతా శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

బద్రుకలో ముగిసిన 'స్ప్లాష్'-2024

కాచిగూడ: బద్రుక పీజీ కళాశాలలో స్ప్లాష్ -2024 పేరుతో రెండురోజుల పాటు నిర్వహించిన మేనేజ్‌మెంట్ అండ్ కల్చరల్ మీట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆదిత్య బిర్లా సంస్థ సౌత్ రిస్క్ హెడ్ ఎస్. సాయిసునీల్, టాక్స్ డైరెక్టర్ శ్రీధర్, బద్రుక కళాశాల కార్యదర్శి కిషన్ బద్రుక, కాలేజ్ పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాజేశ్వర్ రెడ్డి, స్ప్లాష్ కన్వీనర్ డాక్టర్ ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఇథనాల్ పాలసీ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజలతో చర్చించకుండా ఇథనాల్ పాలసీ అమలు చేయడం అప్రజాస్వామికమని మాజీ భారత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈఏఎస్ శర్మ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజల కోసం శాస్త్రవేత్తలు, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనం సాధ్యత, సుస్థిరత, శాస్త్రీయత అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన వర్చువల్‌గా మాట్లాడుతూ ఇథనాల్ ఉత్పత్తిని బ్రెజిల్, అమెరికా తదితర దేశాలు వదులుకున్న తర్వాత మన దేశం ఎత్తుకోవడం సరైంది కాదన్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను పెంచి ఇంధన అవసరాలను తగ్గించుకుని ఇథనాల్ ఉత్పత్తిని నిలుపుదల చేయకపోతే భవిష్యత్‌లో నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాల కొరత ఏర్పడుతుందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమలను ఒక శాతం ఉన్న పెట్టుబడిదారుల అభివృద్ధి కోసమే అన్నారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం వరి సాగుపైనే మొగ్గు చూపడం సరైంది కాదన్నారు. ఆహార భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉన్న ఇథనాల్ కంపెనీని అడ్డుకోకుంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిత్తులూరి కంపెనీని అడ్డుకోవాలని అందుకు సీఎం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబురావు, డాక్టర్ అహ్మద్‌ఖాన్, ప్రొఫెసర్లు జి.విజయ్, శ్రీనివాసులు, ఆమంచి నాగేశ్వర్‌రావు, కె.వై.రత్నం, కేజే రామారావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల చట్టం అమలుకు కృషి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల హక్కుల చట్టం అమలుకు తనవంతుగా కృషి చేస్తానని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా డిజేబుల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో వికలాంగుల అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ 1 నుంచి 5లోగా బ్యాంక్ అకౌంట్‌లో పడే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన వికలాంగులందరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కేటాయించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు రోస్టర్ పాయింట్‌లు పదిలోపు తగ్గించి వెంటనే ఉద్యోగాలు ఇచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆల్ ఇండియా డిజబుల్డ్ రైట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యక్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు రాజకీయాల్లో రాణించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి తదితరులు

కాచిగూడ: విశ్వ బ్రాహ్మణులు రాజకీయాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ, వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పోటీ చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజకీయాలకతీతంగా సంఘటితంగా హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, ప్రధానకార్యదర్శి చొల్లేటి కృష్ణామాచారి, కన్నెకంటి వెంకటరమణ, డాక్టర్ త్రిమూర్తుల గౌరీశంకర్, డాక్టర్ లాల్‌కోట వెంకటాచారి, పెదపాటి నాగేశ్వర్ రావు, రవీంద్రాచారి, సంఘం రాష్ట్ర ప్రతినిధులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

22న ఇంటింటా శ్రీరామజ్యోతి వెలిగించాలి



సి.నందకిషోర్ యాదవ్

కాచిగూడ: అయోధ్య శ్రీరామ మందిరంలో జరగబోయే ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఇంట్లో పూజలు చేసి శ్రీరామ జ్యోతి వెలిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నందకిషోర్ యాదవ్ అన్నారు. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత హిందువుల కల ఈ నెల 22న నెరవేరుతుందన్నారు. దివ్యమైన శ్రీరామ మందిరం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఈ నెల 22న ప్రతి కాలనీ, బస్తీల్లోని దేవాలయాలను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేయాలన్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికి శ్రీరామ అక్షింతలు చేరాయని పూజలు చేసి వాటిని నెత్తిన చల్లుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో శ్రీరామ జ్యోతి వెలిగించి దీపావళి జరుపుకోవాలని కోరారు.

రామ మందిర నిర్మాణం ఆనందదాయకం



నల్లపోచమ్మ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్

కాచిగూడ: అయోధ్యలో శ్రీ రామమందిర ప్రాణ ప్రతిష్ఠను పురష్కరించుకుని దేశవ్యాప్తంగా ఆలయాలను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయాన్ని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ 500 ఏళ్ల తర్వాత జనవరి 22న రామ మందిరాన్ని పునర్ నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయాల స్వచ్ఛతను ఉద్యమంలా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, మల్లిఖార్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.